నమస్తే తెలంగాణ

# హైదరాబాద్

హైదరాబాద్- మేడ్చల్

I | హైదరాబాద్, గురువారం 1 ఆగస్టు 2024 | HYDERABAD



బుధవారం ఆటో డ్రైవర్ల పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆటో రిక్షా డ్రైవర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో ఇందిరాపార్క్ ధర్నా చౌక్‌లో వందలాది మంది నిరసన తెలిపారు. సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు. -చిక్కడపల్లి



**బల్దియాలో** అమలు చేస్తున్న బెస్ట్ ప్రాక్టీసెస్, పట్టణ వరద నిర్వహణ, క్రమబద్ధీకరణ పద్ధతులు, విపత్తుల నిర్వహణకు చేపట్టిన చర్యలు అద్భుతంగా ఉన్నాయని యూపీ మేయర్లు అన్నారు. రెండు రోజుల పాటు అధ్యయనం కోసం కాన్పూర్, లక్నో, గోరక్‌పూర్, అయోధ్య పట్టణాలకు చెందిన మేయర్లు బుధవారం నగరానికి వచ్చారు. జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలో మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతాశోభన్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. -సిటీబ్యూరో



# చంపేస్తున్నాయ్!

## గ్రేటర్‌లో పేట్రేగిపోతున్న వీధి కుక్కలు

ప్రాణాలు పోతున్నా.. గుణపాఠం నేర్వని బల్దియా



### రోజూ ఐపీఎంకి 250-300 మంది బాధితులు.. బల్దియా కాల్ సెంటర్‌కు 98కిపైగా ఫిర్యాదులు

సిటీబ్యూరో/నెట్‌వర్క్, జూలై 31 (నమస్తే తెలంగాణ) : గ్రేటర్ హైదరాబాద్‌లో వీధి కుక్కలు పేట్రేగిపోతున్నాయి. బస్తీలు, కాలనీల్లో స్వైర విహారం చేస్తున్నాయి. గుంపులు గుంపులుగా తిరుగుతూ చిన్నారులపై దాడులు చేస్తున్నాయి. కొన్ని చోట్ల క్రూర మృగాల్లా రెచ్చిపోతూ.. పసిపిల్లల ప్రాణాలు తీస్తున్నాయి. గత నెల 6న మియాపూర్‌లో ఆరేండ్ల సాత్విక్‌ను వీధి కుక్కలు చంపేశాయి. మొన్న చిత్రపూరి కాలనీలో వాకింగ్ చేస్తున్న గృహిణిపై కుక్కల మంద దాడి చేసి గాయపరిచాయి. అంబర్‌పేటలోని ఎరుకల బస్తీలో వీధి కుక్కలు స్కూల్‌కు వెళ్లే చిన్నారులపై దాడిచేయగా, ఓ బాలుడు చనిపోయాడు. పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఛత్తీస్‌గఢ్‌కు చెందిన ఐదేండ్ల దీపాలి ఆడుకుంటుండగా.. కుక్కలు దాడిచేయగా, చికిత్స పొందుతూ మృతిచెందింది. జవహర్‌నగర్‌లో ఓ బాలుడిని కొరికి చంపేశాయి. ఈ ఘటన అందరినీ తీవ్రంగా కలిచివేసింది. ఇలా వీధి కుక్కలు చిన్నారుల పాలిట మృత్యు మృగాలుగా మారుతున్నాయి. నిత్యం గ్రేటర్‌లో ఏదో ఒక చోట ఎవరో ఒకరు కుక్క కాటుకు గురవుతూనే ఉన్నారు. వీధి కుక్కల బెడద నుంచి విముక్తి కల్పించాలంటూ జీహెచ్‌ఎంసీకి రోజూ 98కి పైగా ఫిర్యాదులు వస్తున్నాయి. ఇప్పటికే మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అధ్యక్షతన అన్నిపార్టీల ప్రజాప్రతినిధులతో ఏర్పడిన హైలెవల్ కమిటీ విధానాలు బుట్టదాఖలయ్యాయి. తాజాగా, పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి దానకిశోర్ సమీక్ష నిర్వహించి జోనల్ స్థాయి కమిటీలు, షెల్టర్ హోంలు, వీధి కుక్కల నియంత్రణకు ప్రత్యేక కార్యాచరణ ప్రకటించారు. కానీ జనాలకు కుక్కల కాట్లు మాత్రం తప్పడం లేదు. నారాయణగూడ ఐపీఎంకి రోజూ 250 నుంచి 300 మంది వరకు, ఫీవర్ దవాఖానకు నెలకు 2 వేల మందికిపైగా కుక్క కాటు బాధితులే వస్తుండటం ఆందోళన కలిగిస్తున్నది.

### కోట్లు ఖర్చు చేస్తున్నా..

గ్రేటర్‌లో ఐదు చోట్ల జంతు సంరక్షణ కేంద్రాలు ఉన్నాయి. జీహెచ్‌ఎంసీ పరిధిలో ఏడాది కిందట 5.7 లక్షల కుక్కలు ఉన్నట్లు అధికారులు పేర్కొన్నారు. యానిమల్ బర్త్ కంట్రోల్ (ఏబీసీ), యాంటీ రేబిస్ (ఏఆర్) కార్యక్రమాలను చేపడుతున్నారు. ఒక్క కుక్కకు కు.ని శస్త్ర చికిత్స చేసేందుకు దాదాపుగా రూ. 300 వరకు ఖర్చు చేస్తున్నారు. వాస్తవానికి కుక్కలను పూర్తిస్థాయిలో గుర్తించి.. కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్సలు సక్రమంగా పూర్తిచేస్తే... వాటి సంఖ్య పెరిగే అవకాశం ఉండదు.

### 18,618 మంది బాధితులు

నల్లకుంటలోని ఫీవర్ దవాఖానలో నెలకు రెండు వేలకు పైగా కుక్కకాటు కేసులు వస్తున్నాయి. గడిచిన ఏడు నెలల్లో 18,618 కేసులు నమోదయ్యాయి. ఈ ఏడాది జనవరి నుంచి పరిశీలిస్తే...జనవరిలో 2731, ఫిబ్రవరిలో 2548, మార్చిలో 2644, ఏప్రిల్‌లో 2709, మే నెలలో 2789, జూన్ నెలలో 2607, జూలైలో ఇప్పటి వరకు 2590 కేసులు నమోదయ్యాయి. అలాగే నారాయణగూడలోని ఐపీఎంలో 2024 జనవరి నుంచి జూలై 31 వరకు 7 నెలల వ్యవధిలోనే 19,854 కేసులు నమోదయ్యాయి. ఐపీఎంలో ప్రతిరోజు 250 నుంచి 300 వరకు కుక్కకాటు కేసులు నమోదవుతున్నాయి. ప్రస్తుతం కుక్కకాటు బారిన పడిన ప్రతి ఒక్కరికి మొదటి రోజు.. ముడో రోజు.. ఏడో రోజు.. 28వ రోజు నాలుగు విడతాల్లో 2 ఎంఎల్ యూనిట్స్ ఎడమ చేతికి 1 ఎంఎల్..కుడి చేతికి 1 ఎంఎల్ యూనిట్స్ ఇంజక్షన్ ఇస్తున్నారు. కాగా, జైపూర్, గోవాల్లో ఏబీసీ కార్యక్రమాల అమలు బాగుందనే అభిప్రాయాలున్నాయి. అక్కడ ఆడ కుక్కలన్నింటికీ ఆపరేషన్లు చేయడంతో పాటు మగవాటికి సంతానోత్పత్తి వయసు వచ్చే సమయంలో (5-12 నెలల మధ్య) సంతాన నిరోధక శస్త్ర చికిత్సలు చేస్తారని, 'మిషన్ రేబిస్' పేరిట వ్యాక్సినేషన్ డ్రైవ్ ఇతరత్రా కార్యక్రమాలు నిర్వహిస్తారని జంతు ప్రేమికులు చెబుతున్నారు.

### డాక్టరై సేవ చేస్తాడని కలలు కంటే...



బతుకు దెరువు కోసం సిద్దిపేట జిల్లా మిరుదొడ్డి గ్రామం నుంచి జవహర్‌నగర్ బాలాజీనగర్‌కు వచ్చిన పుల్లూరి భరత్‌కుమార్, వరలక్ష్మి దంపతులు ఇద్దరు కూతుర్లు సాహితి(12), శ్రుతి(10), కుమారుడు విహాన్(16 నెలలు)తో కలిసి బంధువుల ఇంట్లో నివాసముంటున్నారు. భరత్‌కుమార్ స్థానికంగా కార్పెంటర్ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. బంధువుల ఇంట్లో ఎంతకాలం ఉంటామని... మరో ఇంటిని కిరాయికి తీసుకొని.. పిల్లలను పాఠశాలలో వేద్దామనుకున్నాడు. ఇంతలోనే ఈనెల 16న జవహర్‌నగర్ ఆదర్శకాలనీలో కుమారుడు విహాన్‌ను వీధి కుక్కలు నోట్లో కరుచుకొని.. కొంత దూరం లాకెళ్లి..పీక్కుతినడంతో ఆ చిన్నారి ప్రాణాలు వదిలాడు. ఈ ఘటన యావత్ తెలంగాణ సమాజాన్ని కలిచివేసింది. కుమారుడిని కష్టపడి చదివించి డాక్టర్‌ను చేద్దామనుకుంటే వీధి కుక్కలు పొట్టనబెట్టుకున్నాయని ఆ తల్లిదండ్రులు కన్నీరుమున్నీరయ్యారు. కూలి పనులు చేసుకుంటేనే కుటుంబం గడుస్తుందని, ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.



### ఎనిమిల్ కేర్ సెంటర్‌లో ఏం చేస్తున్నారంటే..

జీహెచ్‌ఎంసీ పరిధిలో ఐదు యానిమిల్ కేర్ సెంటర్లు ఉండగా..కాలనీలు, బస్తీల నుంచి వచ్చిన ఫిర్యాదుల ఆధారంగా ప్రతి రోజు సుమారు 40 నుంచి 50 వీధి కుక్కలను పట్టుకుని యానిమల్ కేర్ సెంటర్‌కు తీసుకొని వస్తున్నారు. ఆడ, మగ కుక్కలకు ఫ్యామిలీ ప్లానింగ్ ఆపరేషన్ (ఏబీసీ) చేస్తున్నారు. ఆపరేషన్ అనంతరం కుక్క కుడి చెవి చివరన వీ షేప్‌లో కట్ చేస్తారు. అదేవిధంగా ప్రతి కుక్కకూ యాంటీ రేబిస్ వ్యాక్సిన్ (ఏఆర్) ఇస్తారు. వ్యాక్సిన్ హ్యూమినిటీ సంవత్సరం పాటు ఉంటుంది.

### ప్రతిసారీ 4-8 పిల్లలు



- కుక్కల జీవిత కాలం 8-12 సంవత్సరాలు
- 8 నెలల వయసు నిండేటప్పటికీ సంతానోత్పత్తి సామర్థ్యం వస్తుంది
- కుక్కల గర్భ ధారణ సమయం 60-62 రోజులు
- సంతానోత్పత్తి జరిపిన ప్రతిసారీ 4-8 పిల్లలు పెడుతుంది.



### అశ్రద్ధ చేయొద్దు

**-డాక్టర్ శివలీల(డైరెక్టర్, ఐపీఎం నారాయణగూడ)**

వీధి కుక్కలతో పిల్లలు, ప్రజలు జాగ్రత్తగా ఉండాలి. ఐపీఎంలోని కుక్క కాటు బాధితులకు అన్ని విధాల యాంటీ రేబిస్ వాక్సినేషన్ అందుబాటులో ఉంది. కుక్క కరిచి ఎక్కువ రక్తం వచ్చే వారు అశ్రద్ధ చేయకుండా ఇమ్యూనోగ్లోబులిన్స్ ఇంజక్షన్‌ను తీసుకోవడానికి కోరంటి దవాఖానను పంపిస్తాం. వేసవిలో కుక్క కాటు బారిన పడే వారి సంఖ్య ఎక్కువగా ఉంటుంది.

### ప్రభుత్వం పట్టించుకోలే

**- సాత్విక్ తండ్రి వీరేశ్ (మియాపూర్)**

మా బాబు సాత్విక్ వీధికుక్కల దాడిలో ప్రాణాలు వదిలాడు. పాఠశాలకు వెళ్లి సాయంత్రం అటునుంచి డంప్ యార్డుకు వెళ్లిన తమ చిన్నారి సాత్విక్‌పై వీధి శునకాలు దాడి చేయడంతో తీవ్ర గాయాలపాలై మృతి చెందాడు. నాటి నుంచి నేటి వరకు మా కుటుంబాన్ని ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోలేదు. కాలనీ వాసులు తలా కొంత వేసుకుని ఆర్థిక సాయాన్ని అందించారు.

### 4 సార్లు ఇంజక్షన్ తీసుకోవాలి...

**-సచిన్(ఆదిలాబాద్)**

వారం రోజుల కిందట ఆదిలాబాద్‌లో వీధి కుక్క కరిచింది. నారాయణగూడలోని ఐపీఎంలో యాంటీ రేబిస్ వాక్సినేషన్ ఇచ్చారు. నాలుగు సార్లు ఈ యాంటీ రేబిస్ ఇంజక్షన్ తీసుకోవాలని డాక్టర్లు సూచించారు.

### కుక్కల బెడదను భరించలేకపోతున్నాం

**- సరిత, నార్త్ ఎన్‌సీఎల్ కాలనీ, కొంపల్లి**

కొంపల్లి నార్త్ ఎన్‌సీఎల్ కాలనీలో కుక్కల బెడదను భరించలేకపోతున్నాం. రెండుసార్లు నన్ను గాయపరిచాయి. నా కూతురు తన్విహను సైతం గాయపర్చాయి. కాలనీలో వీధికుక్కల బెడదతో చాలామందికి గాయాలయ్యాయి.

### ప్రజలు సహకరించాలి

కుక్కలను నియంత్రించడానికి ప్రజలు సహకరించాలని జీహెచ్‌ఎంసీ వెటర్నరీ అధికారులు కోరుతున్నారు. వీధి కుక్కల నియంత్రణలో భాగంగా కు.ని. శస్త్ర చికిత్సలు సక్రమంగా చేస్తున్నామన్నారు. నగర శివారు ప్రాంతాల నుంచి కుక్కలు నగరంలోకి ప్రవేశించి... కాలనీలు, బస్తీల్లో సంచరిస్తున్నాయి. ఇండ్లలో వెలువడే ఆహార పదార్థాలను రోడ్లపై, చెత్తకుప్పల్లో వేయడం మానుకోవాలి. వీధి కుక్కలతో ఇబ్బందులు ఏర్పడితే వెంటనే 040-2311 1111 ఫోన్ నెంబర్ ద్వారా ఫిర్యాదు చేయాలని సూచిస్తున్నారు.

## మూసీపై గందరగోళం.. ఆగని డంబాచారం

సిటీబ్యూరో: మూసీ సుందరీకరణ విషయంలో ప్రచారమే లక్ష్యంగా ప్రభుత్వం డంబాచార ప్రకటనలతో ఇటు జనాలను అటు అధికారులను అయోమయానికి గురిచేస్తోంది. పూటకో మాటతో మంత్రులు చేస్తున్న ప్రకటనలు మరిన్నీ అనుమానాలకు తావిస్తోంది. ఓవైపు మూసీ ప్రక్షాళనకు అంచనా వ్యయాన్ని రూ. లక్ష కోట్లకు పెంచగా, తాజాగా అసెంబ్లీ సాక్షిగా మంత్రులు చేసిన ప్రకటనలతో మూసీ సుందరీకరణ కాంగ్రెస్ ప్రభుత్వం చేయగలుగుతుందా అనే అనుమానాలు జనాల్లో వ్యక్తమవుతున్నాయి. అసెంబ్లీ వేదికగా బడ్జెట్ ప్రసంగంలో ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క మూసీని థేమ్స్ నది తరహాలో తీర్చిదిద్దేందుకు డీపీఆర్ సిద్ధంగా ఉందని ప్రకటించారు. ఇదిలా ఉంటే బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మూసీ సుందరీకరణపై నెలకొన్న గందరగోళానికి తెరదించేలా మరోసారి ప్రభుత్వాన్ని నిలదీయడంతో అసలు విషయం వెలుగులోకి వచ్చింది. మంత్రి శ్రీధర్ బాబు స్పందిస్తూ..మూసీపై డీపీఆర్ సిద్ధం కాలేదని కుండ బద్ధలు కొట్టారు. దశల వారీగా మూసీని అభివృద్ధి చేసుకునేందుకు రూపొందించాల్సిన ప్రణాళికలను తయారు చేసేందుకు ఆ నిధులను వినియోగిస్తామని వివరణ ఇచ్చారు. ఇలా అస్పష్టమైన ప్రకటనలు, దిశానిర్దేశం లేని ప్రచారంతో మూసీ ఒక డంబాచారంగా మారుతుందనే విమర్శలను కాంగ్రెస్ ప్రభుత్వం మూటగట్టుకుంటున్నది.

## చీఫ్ సిటీ ప్లానర్‌గా శ్రీనివాస్



సిటీబ్యూరో: జీహెచ్‌ఎంసీ చీఫ్ సిటీ ప్లానర్‌గా కె. శ్రీనివాస్‌ను నియమిస్తూ పురపాలక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ దానకిశోర్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. హెచ్‌ఎండీఏలో డైరెక్టర్ ప్లానింగ్-2గా కొనసాగిన శ్రీనివాస్‌ను జీహెచ్‌ఎంసీకి సీసీపీ బదిలీ చేశారు. జీహెచ్‌ఎంసీ సీసీపీగా కొనసాగిన రాజేంద్ర ప్రసాద్ నాయక్‌ను హెచ్‌ఎండీఏ డైరెక్టర్ ప్లానింగ్-2గా బాధ్యతలు అప్పగించారు.

## ప్రతి ఉద్యోగికి సేవలతోనే గుర్తింపు

సిటీబ్యూరో: జీహెచ్‌ఎంసీలో వివిధ విభాగాల్లో పనిచేసిన 12 మంది ఉద్యోగులకు ఉద్యోగ వయోపరిమితి పూర్తయిన నేపథ్యంలో జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలో బుధవారం వారికి వీడ్కోలు సభను నిర్వహించి ఘనంగా సన్మానించారు. అదనపు కమిషనర్ (అడ్మిన్) నళిని పద్మావతి మాట్లాడుతూ ప్రతి ఉద్యోగికి తమ సేవలతోనే గుర్తింపు లభిస్తుందన్నారు.

## ప్రతి సర్కిల్‌లో ప్రజా పాలన సేవా కేంద్రాలు

సిటీబ్యూరో: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు అర్హులైన వారికి అందించేందుకు జీహెచ్‌ఎంసీ వ్యాప్తంగా ప్రజా పాలన సేవా కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇందులో అర్హులైన వారు తమ దరఖాస్తులను అందజేయవచ్చని కమిషనర్ ఆమ్రపాలి సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు అందించేందుకు ఈ కేంద్రాలు ఉపయోగపడతాయన్నారు. అర్హులైన వారు తమ సమీపంలో ఉన్న ప్రజా సేవా కేంద్రాల వద్దకు వెళ్లి దరఖాస్తులు చేసుకోవాలన్నారు. సర్కిల్ పరిధిలో ప్రజా సేవా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు.

## విలీనానికి ముహూర్తం ఖరారు

సిటీబ్యూరో, జూలై 31(నమస్తే తెలంగాణ): ఔటర్ రింగ్ రోడ్ లోపల ఉన్న మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు, గ్రామ పంచాయతీలను జీహెచ్‌ఎంసీలోకి విలీనానికి ముహూర్తం ఖరారయింది. ఓఆర్‌ఆర్ లోపలి వరకు జీహెచ్‌ఎంసీని విస్తరించాలని ప్రభుత్వం నిర్ణయించిన దరిమిలా మేడ్చల్ -మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాల పరిధిలో ఉన్న 8 మున్సిపల్ కార్పొరేషన్లు, 20 మున్సిపాలిటీలు, 33 గ్రామ పంచాయతీలు జీహెచ్‌ఎంసీలో విలీనం కానున్నాయి. ఈ మేరకు గురువారం జరిగే రాష్ట్ర కేబినెట్ సమావేశంలో ఈ ప్రతిపాదనను ఆమోదించనున్నారు. శుక్రవారం జరిగే అసెంబ్లీ సమావేశంలో సభ్యుల ఆమోదానికి ఈ ప్రతిపాదనపై చర్చించనున్నారు. ఇప్పటికే హైడ్రాను ప్రభుత్వం ఏర్పాటుచేయగా, తాజాగా ఈ విలీన ప్రతిపాదనపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

## నిందితులకు పోలీసులే సహకరిస్తున్నారంటూ..

హయత్‌నగర్, జూలై 31 :నిందితులకు పోలీసులే సహకరిస్తున్నారంటూ.. మృతురాలి బంధువులు ఆందోళనకు దిగడం ఉద్రిక్తతకు దారితీసింది. హయత్‌నగర్ డివిజన్ బంజారాకాలనీలో బాలింత రమావత్ సుజాత అలియాస్ దివ్య(21) ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. అయితే ఆమె భర్త శివ నాయక్, అత్త దశమి, మామయ్య పాపయ్య నాయక్, మరో ముగ్గురు కలిసి దివ్యను అదనంగా వరకట్నం తీసుకురావాలని వేధించేవారని, ఆమెను హత్య చేసి ఆత్మహత్యగా చిత్రీకరిస్తున్నారని, నిందితులకు స్థానిక పోలీసులే సహకరిస్తున్నారని మృతురాలి కుటుంబసభ్యులు, బంధువులు ఆరోపించారు. పోలీసు స్టేషన్ ఎదుట ధర్నా, అనంతరం విజయవాడ జాతీయ రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. పోలీస్ స్టేషన్ లోపలికి చొచ్చుకెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో ఆందోళనకారులు, పోలీసులకు మధ్య జరిగిన తోపులాటలో పలువురు మహిళా పోలీసు సిబ్బంది గాయపడ్డారు. 'నిందితులను అరెస్టు చేసి విచారిస్తున్నాం. దివ్య మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ఉస్మానియా మార్చురీకి తరలించాం. మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టాం'. అని హయత్‌నగర్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ తెలిపారు.

## ఖజానా నింపుకొనేందుకు..

# ఎల్ ఆర్ ఎస్ తెరమీదకు

**ఎన్నికల సందర్భంగా రద్దు చేస్తామని కాంగ్రెస్ హామీ**

**అధికారంలోకి వచ్చాక.. మాట మార్చిన వైనం**

**మూడు లక్షలకు పైగా దరఖాస్తులు పెండింగ్**

సిటీబ్యూరో, జూలై 31 (నమస్తే తెలంగాణ) : ఎన్నికల సమయంలో ఎల్‌ఆర్‌ఎస్‌ను రద్దు చేస్తామంటూ నమ్మించి.. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. ఇప్పుడు ఎల్‌ఆర్‌ఎస్ ద్వారా ఖజానా నింపుకొనేందుకు ప్రణాళికలను రూపొందిస్తున్నది. హెచ్‌ఎండీఏ పరిధిలో 3.60 లక్షల మంది ఓపెన్ ప్లాట్ల క్రమబద్ధీకరణ కోసం దరఖాస్తు చేసుకోగా, ఇందులో 1.16 లక్షల అర్జీలను పరిశీలించారు. వీటిలో 1.12 లక్షల దరఖాస్తుల్లో ఉన్న లోపాలను వివరిస్తూ అధికారులు షార్ట్ ఫాల్ చేయగా, 653 దరఖాస్తులను తిరస్కరించారు. అయితే పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను వేగంగా పరిష్కారించాలని ప్రభుత్వం యోచిస్తోంది. ఈ క్రమంలో ప్రభుత్వం చూపుతున్న చొరవతో సామాన్యుడిపై ఎల్‌ఆర్‌ఎస్ భారం పడనున్నదని రియల్ ఎస్టేట్ వర్గాలు ఆరోపిస్తున్నాయి. ఎన్నికల్లో ఓట్ల కోసం ఎల్‌ఆర్‌ఎస్ రద్దు చేస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చిందని, గెలిచిన తర్వాత కేవలం ఖజానా నింపుకొనేందుకే ఎల్‌ఆర్‌ఎస్‌ను తెరమీదకు తీసుకొచ్చిందని తెలంగాణ రియల్టర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ నారగోని ప్రవీణ్ కుమార్ ఆరోపించారు. కాంగ్రెస్ సర్కారు ఎల్‌ఆర్‌ఎస్‌ను ఆదాయ వనరుగా భావిస్తోందని, మార్కెట్ ధరపై చదరపు గజానికి 14శాతం మేర వసూలు చేయనున్నదని చెప్పారు. ఈ లెక్కన ప్రభుత్వం ఒక్కో దరఖాస్తుదారులపై రూ.2-4లక్షల భారం మోపేందుకు సిద్ధమవుతున్నదన్నారు. కాంగ్రెస్ సర్కారు పునరాలోచన చేయాలని, ఎల్‌ఆర్‌ఎస్‌ను పూర్తిగా రద్దు చేయాలని, లేదంటే కలిసివచ్చే పార్టీలు, ప్రజా సంఘాలతో ఎల్‌ఆర్‌ఎస్ వ్యతిరేక ఉద్యమానికి రూపకల్పన చేస్తామని ప్రవీణ్ స్పష్టం చేశారు.